ధాన్యం సేకరణలో మహిళా చైతన్యం

- కొనుగోళ్లలో గ్రామ సమైక్య సంఘాలు
- కమీషన్ రూపంలో రూ.1.10 కోట్ల ఆదాయం
- ఇంకా రావాల్సిన కమీషన్ రూ.28.50 లక్షలు



ఇందుర్తిలో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు(ఫైల్)



తేమశాతం చూస్తున్న అధికారులు(ఫైల్)

చిగురుమామిడి: ధాన్యం సేకరణలో మహిళల చైతన్యం వెల్లివిరుస్తోంది. సంఘాల్లోని మహిళలు సమర్థవంతం పనిచేస్తూ రైతులు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లలో మండలంలోని మూడు గ్రామైక్య సంఘాలు రూ.1.10 కోట్ల ఆదాయం సంపాదించాయి. ఈ ఆదాయం కమీషన్ రూపంలో రాగా సంఘాలు ఆర్థిక పరిపుష్టిని సాధించడం విశేషం. ఇందుర్తి, చిగురుమామిడి, బొమ్మనపల్లి గ్రామాల్లోని సంఘాలు ఏటా రెండు సీజన్లలో ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తున్నాయి. ఇందుర్తి, చిగురుమామిడిలోని సంఘాలు 2007–08 నుంచి , బొమ్మనపల్లిలోని సంఘం 2017–18 నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నాయి. అప్పటి నుంచి నేటివరకు రూ.కోటికిపైగా ఆదాయం సంపాదించడం విశేషం. ఇందుర్తి సంఘం ఖాతాలో రూ.40 లక్షలు, చిగురుమామిడి సంఘం ఖాతాలో రూ.30 లక్షలు, బొమ్మనపల్లి సంఘం ఖాతాలో రూ.40 లక్షలు కమీషన్ రూపంలో జమయ్యాయి. ప్రతి సీజన్‌లో సంఘాల మహిళలు వంతుల వారీగా ధాన్యం కొనుగోలు చేసి కేటాయించిన రైస్ మిల్లులకు తరలించి రైతులకు డబ్బులు ఇప్పిస్తారు. ప్రతి సీజన్‌లో దాదాపు ఎనిమిది వేల నుంచి పదివేల క్వింటాళ్ల ధాన్యాన్ని 30 రోజుల నుంచి 40 రోజుల్లో కొనుగోలు చేస్తుంటారు. క్రమశిక్షణతో కొనుగోళ్లు నిర్వహించి పలువురు మన్ననలు పొందుతున్నారు. డీఆర్‌డీవో పీడీ, కలెక్టర్, పౌరసరఫరాల కమిషనర్లు తనఖీలు చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ధాన్యం సేకరణలో ఐకేపీ సీసీలు ప్రతిరోజు పర్యవేక్షిస్తుంటారు. ఐకేపీ ఏపీఎం రైతులు, బ్యాంకు, ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ లోపాలను సవరించి వెన్నుదన్నుగా నిలవడంతో మహిళలు పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. రైతులకు గన్నీబ్యాగులు, టార్పాలిన్లు తదితర ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. 2023 వానాకాలం, 2024 యాసంగి, వానాకాలం ధాన్యం కొనుగోలు కమీషన్ డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. మూడు సీజన్లకు సంబంధించి దాదాపు రూ.28.50 లక్షల కమీషన్ రావాల్సి ఉంది. ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ సంతృప్తి వ్యక్తం చేశారు. 2024 నవంబర్ 20వ తేదీన చిగురుమామిడిలో ధాన్యం కొనుగోళ్లను కలెక్టర్ పమేలాసత్పతి, అదనపు కలెక్టర్‌తో కలిసి తనిఖీ చేసి మంచి కితాబు ఇచ్చారు. ఆయా మహిళా సంఘాల బ్యాంకు ఖాతాల్లో కమీషన్ డబ్బులు నిల్వ ఉన్నాయి. ఆపదలో మహిళలు రూ.లక్ష వరకు అప్పుగా తీసుకునే వెసులుబాటు ఉంది.

అప్పుగా ఇస్తున్నాం



పదహారేళ్లుగా గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు నిర్వహిస్తున్నాం. నాటి నుంచి నేటి వరకు ప్రతిరోజు పర్యవేక్షణ చేస్తూనే ఉన్నాం. ఆయా సంఘాల ఖాతాల్లో కమీషన్ డబ్బులు రూ.కోటి పదిలక్షలు వరకు ఉన్నాయి. వాటిని నిల్వ ఉంచకుండా ఆపదలో ఉన్న మహిళలు అప్పుగా తీసుకునే వీలుంది. ఇప్పటి వరకు చాలా మందికి అప్పు ఇచ్చాం, ఇంకా మూడు సీజన్లకు సంబంధించిన కమీషన్ రావాల్సి ఉంది.

– మట్టెల సంపత్, ఏపీఎం, చిగురుమామిడి

క్లుప్తంగా

పట్టు పరిశ్రమ కేంద్రం సందర్శన



పట్టును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

హుజూరాబాద్: మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో రైతు నిమ్మల స్వామిరెడ్డి నిర్వహిస్తున్న సెరికల్చర్ సాకీ పట్టు పరిశ్రమ కేంద్రాన్ని గురువారం సెంట్రల్ సీక్రెట్ సీఎస్ఆర్టీఐ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ శాస్త్రవేత్తల బృందం సందర్శించింది. పట్టు పరిశ్రమ రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. చీడపీడల నివారణ, ఆదాయం పెంపు అంశాలు వివరించారు. కార్యక్రమంలో సెంట్రల్ రీసెర్చ్ సైంటిస్ట్ డాక్టర్ భాగ్య, డాక్టర్ అరుణ్ కుమార్, మల్లికార్జున్, ఆర్ఎస్ఆర్ ములుగు సైంటిస్ట్ రాఘవేంద్ర, ఆర్ఎస్ఆర్ జిల్లా బీహెచ్ఎస్ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ



హుజూరాబాద్: పట్టణంలో మదర్సా బాలికల భవన నిర్మాణానికి గురువారం ప్రసిద్ధ మత గురువు మౌలానా సయ్యద్ అహ్మద్ నద్వినక్షంబ కుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ బాలికలకు విద్య ఎంతో ముఖ్యమని, తల్లిదండ్రులు బాలిక విద్యను ప్రోత్సహించాలన్నారు. మంచి చదువులతో పాటు ధార్మిక విద్య కూడా నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్, మహమ్మద్ జాకీర్, మొహమ్మద్ అన్వర్, మహమ్మద్ అబ్దుల్ వహాబ్, అన్వర్ తదితరులున్నారు.

సరోజినీ నాయుడికి నివాళి



నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

చొప్పదండి: నైటాంగిల్ ఆఫ్ ఇండియాగా పేరొందిన మొదటి మహిళా గవర్నర్ సరోజినీ నాయుడి జయంతిని పురస్కరించుకొని మండలంలోని పాఠశాలల్లో తెలంగాణ ఆంగ్ల దినోత్సవం, జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్నకొండ జడ్పీహెచ్ఎస్‌లో ఎంఈవో శ్రీనివాస్ సరోజిని చిత్రపటానికి పూలమాల వేశారు. చొప్పదండిలోని బాలుర ఉన్నత పాఠశాల, వీణాధరి ఉన్నత పాఠశాల్లో జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

హుజూరాబాద్: సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం సరోజిని నాయుడు చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం రోజా, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

నియామకం



వేణుగోపాల్

హుజూరాబాద్: హుజూరాబాద్ లైసెన్స్‌డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన నలుబాల వేణుగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సబ్బని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ఎండీ.గౌస్, కార్యదర్శిగా రామగిరి విక్రం, కోశాధికారిగా రావుల అరుణ్‌కుమార్, ప్రోగ్రాం కన్వీనర్‌గా గోవు నరేశ్, కార్యవర్గ సభ్యులుగా వెంకటరమణ, నలుబాల సుమన్, కుమార్ ఎన్నికయ్యారు.

క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గంగాధర: మండలంలోని ఉప్పరమల్యాల గ్రామంలో గురువారం ప్రధాని నరేంద్రమోడీ, కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ చిత్రపటాలకు నాయకులు క్షీరాభిషేకం చేశారు. కురిక్యాల గ్రామం నుంచి బావుపేట ఆసిఫ్‌నగర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరుకావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోల అశోక్, నరసింహరెడ్డి, ఎడవెల్లి శశిధర్‌రెడ్డి, మల్యాల వినయ్, శ్రీహరిరెడ్డి, విజయేందర్‌రెడ్డి, రేండ్ల శ్రీనివాస్, వొడ్నాల రాజు, గుండారపు మధు, ఆకుల మనోహర్, ఆళ్ల కరుణాకర్, రవి, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

జమ్మికుంట: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధి మారుతినగర్‌లో ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణతో కలిసి తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు, గర్భిణులు, చిన్నపిల్లలు, మహిళలకు అందిస్తున్న సేవలు, అమలు తీరును పరిశీలించారు. ఆరోగ్య ఉపకేంద్రంలో పనిచేసే వైద్యులు, సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పేదలకు సంపూర్ణ ఆరోగ్య భరోసా, వైద్యం అందించాలని సూచించారు. ముందుగా వైద్యులు, సిబ్బంది శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు నాయక్, ఎన్‌హెచ్‌ఎం డీపీవో స్వామి, వావిలాల పీహెచ్‌సీ వైద్యులు రాజేశ్, మహోన్నత పటేల్, సీహెచ్‌వో శ్యామ్, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్ అరుణ, ఏఎన్‌ఎంలు మంజుల, రజిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కేశవపట్నం పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ రవీంద్రనాయక్

శంకరపట్నం: కేశవపట్నం ప్రాథమిక కేంద్రాన్ని రవీంద్రనాయక్ తనిఖీ చేశారు. ల్యాబ్, ఫార్మసీ రూం, రిజిష్టర్ తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు పేదలు వెళ్లకుండా రక్త పరీక్షలు, సాధారణ కాన్పులు చేయాలని వైద్యులకు సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. వైద్యసేవలు, వైద్యసిబ్బంది తీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రావణ్ కుమార్, వైద్యసిబ్బంది ఉన్నారు.

మత్స్యగిరీంద్రస్వామికి చక్రస్నానం



శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం కోనేరులో స్వామివారి చక్రస్నానం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శేషం మురళీధరాచార్యులు, మధవాచార్యులు శేషహోమం, మహాపూర్ణాహుతి, బలిహరణం, తీర్థగోష్టి కార్యక్రమాలు జరిపించారు. చక్రస్నానంలో ఆలయ చైర్మన్ మల్లారెడ్డి, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

సామాజిక సేవా దృక్పథంతో సామూహిక వివాహాలు

జమ్మికుంట: సామాజిక సేవా దృక్పథంతో అన్నా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు చేస్తున్నామని ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్, పీసీసీ కమిటీ మెంబర్ పత్తి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఆయన నివాసంలో పేద వధూవరులకు పెళ్లివస్త్రాలు అందజేశారు. ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన వివాహ వేదికపై 16న సామూహిక వివాహాలు చేయనున్నామని, 11 జంటలకు పుస్తె మెట్టెలు అందిస్తామన్నారు. వివాహానికి హాజరయ్యే వారికి భోజన వసతి కల్పించనున్నామని తెలిపారు.



దుస్తులు అందజేస్తున్న కృష్ణారెడ్డి దంపతులు

హైనా దాడిలో లేగదూడ మృతి



చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన మహిళా రైతు విజయలక్ష్మికి చెందిన లేగదూడపై హైనా దాడిచేసింది. రోజులానే బుధవారం రాత్రి పశువుల పాకలో లేగదూడను కట్టేసి ఇంటికి వచ్చానని, గురువారం వేకువజామున వెళ్లి చూడగా దూడ మృతిచెంది ఉందని, రూ.30 వేల నష్టం జరిగిందని, హైనా దాడులు రోజురోజుకు ఎక్కువైపోతున్నాయని, ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపెల్లి గ్రామానికి చెందిన గూడూరి అనసూర్య(80) గురువారం మృతి చెందింది. పిల్లలు లేకపోవడంతో గ్రామస్తులు సుధగోని లక్ష్మీనారాయణగౌడ్, కిరణ్‌గౌడ్, పొట్ట శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ నాయి, శ్రీనివాస్‌గౌడ్, తిరుపతి, సంపత్, కొమురయ్య ఆమె అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

వీణవంక: మండలంలోని కొండపాక గ్రామంలో దాట్ల మల్లయ్య రైతుకు చెందిన ఎద్దు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. పొలం వద్ద కాడెద్దులను మేపుతుండగా షాక్‌తో మృతి చెందడంతో రైతు బోరునవిలపించాడు. ఇటీవలే రూ.70 వేలు వెచ్చించి కొనుగోలు చేశానని, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు కంచె ఏర్పాటు చేయకపోవడంతోనే ప్రమాదం జరిగిందని వాపోయాడు. అధికారులు ఆదుకోవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గన్నేరువరం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం సీజ్ చేశామని ఎస్సై తాండ్ర నరేశ్ తెలిపారు. మండలంలోని చొక్కారావుపల్లె బిక్క వాగు నుంచి అనుమతి లేకుండా ఇల్లంతకుంట మండలానికి ఇసుక తరలిస్తుండగా పట్టుకొని పోలీస్‌స్టేషన్ తరలించి డ్రైవర్ మధు, వాహన యాజమాని మహేందర్‌పై కేసు నమోదు చేశామన్నారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

జమ్మికుంట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన కుక్కల మహేశ్ అనుమతి లేకుండా అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

శంకరపట్నం: మండలంలోని తాడికల్, వంకాయ గూడెం గ్రామాల్లో గురువారం ఉపాధిహామీ పనులను డీఆర్‌డీవో శ్రీధర్ పరిశీలించారు. నర్సరీ, ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న రోడ్లు, భవనాల పనులను పరిశీలించి నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ఏపీవో శారద తదితరులున్నారు.

సభ్యుల సహకారంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు రాధాకిషన్‌రావు

మానకొండూర్: సభ్యుల సహకారంతోనే సంఘం అభివృద్ధి బాటలో పయనిస్తోందని గట్టుదుద్దెనపల్లి విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షుడు అనబేరి రాధాకిషన్‌రావు అన్నారు. సొసైటీ పాలకవర్గం ఐదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సంఘం నూతన కార్యాలయ ఆవరణలో సాధారణ మహాసభ నిర్వహించారు. అర్ధ సంవత్సర ప్రగతి నివేదిక సంఘ కార్యదర్శి జి. రామయ్య చదివి వినిపించారు. సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ ఐదేళ్లలో అనేక సమస్యలను అధిగమించుకుంటూ ముందుకెళ్లామని, నేషనల్ హైవే నిర్మాణంలో సంఘం భవనాలు కోల్పోతే అగ్రికల్చర్ భూములుగా పరిగణించి ప్రభుత్వం తక్కువ పరిహారం చెల్లించిందన్నారు. సహకరించిన సంఘం సభ్యులందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశానికి అధికారులు ఎందుకు రాలేదని సభ్యులు ప్రశ్నించారు. సంఘం ఉపాధ్యక్షులు అనంతరెడ్డి, డైరెక్టర్లు మల్లేశం, విజయ, రాజయ్య, యాదగిరి, చంద్రశేఖర్‌రెడ్డి, మల్లేశం, సమ్మయ్య, నర్సింహారెడ్డి సంఘ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కామర్స్ విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

కరీంనగర్ సిటీ: డిగ్రీతోపాటు సీఏ, సీఎంఏ, సీఎస్ ప్రొఫెషనల్ కోర్సులను పూర్తి చేసిన కామర్స్ విద్యార్థులకు వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయని మస్కట్‌లోని మ్యాజిస్ టెక్నాలజీ సర్వీసెస్ సంస్థకు చెందిన కాస్ట్ అండ్ మేనేజ్మెంట్ అకౌంటెంట్(సీఎంఏ) ప్రభాకర్ తెలిపారు. ఎస్ఆర్ఆర్ అటానమస్ కళాశాలలోని కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం వారు ఏర్పాటు చేసిన కెరియర్ గైడెన్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కామర్స్, బీబీఏ విద్యార్థులు డిగ్రీతోపాటు చార్టెడ్ అకౌంటెన్సీ, కాస్ట్ అండ్ మేనేజ్మెంట్ అకౌంటెంట్స్, కంపెనీ సెక్రటరీస్ వంటి ప్రొఫెషనల్ కోర్సులను అధ్యయనం చేయొచ్చన్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ.. కళాశాలలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా చాప్టర్ ఉందన్నారు. వైస్ ప్రిన్సిపాల్, కామర్స్ విభాగాధిపతి టి.రాజయ్య, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ ఎం.మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసిన వారికి అధిక డిమాండ్ ఉందన్నారు. రాజయ్య, డాక్టర్ కదారు సురేందర్‌రెడ్డి, డాక్టర్ ఎం.మల్లారెడ్డి హర్జోత్ కౌర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగేలా కృషిచేస్తా



నివాళి అర్పిస్తున్న వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన చెంచల సంపత్ చింతచెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి గురువారం పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి నివాళి అర్పించారు. ప్రభుత్వం నుంచి న్యాయం జరిగేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. వెంట సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్‌కుమార్, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్, గ్రామకార్యదర్శి బోయిని పటేల్, నాయకులు పరకాల కొండయ్య, విలాసాగరం అంజయ్య, బోయని సంజీవు, సూరం ఐలయ్య ఉన్నారు.



హుజూరాబాద్: మండలంలోని ధర్మరాజుపల్లి గ్రామం చివర రోడ్డు పక్కనే చెత్తనుపడేస్తుండటంతో దుర్వాసన వెలువడుతోంది. అలాగే దోమలు వృద్ధి చెందుతున్నాయని, వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రత్యేకంగా చెత్త కోసం డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
టి. సునీత, ఎంపీడీవో, హుజూరాబాద్ సెల్ నంబర్: 9989930709

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి



రామడుగు: కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు: కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఊట్కూరి నరేందర్‌రెడ్డిని గెలిపించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గురువారం షానగర్‌లోని ఫంక్షన్ హాల్‌లో మండల నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వేల సంఖ్యలో ఉద్యోగాల భర్తీతో పాటు నిర్దిష్టమైన జాబ్ క్యాలెండర్ రూపొందించి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యారంగం పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. పట్టభద్రులను కలిసి మద్దతు ఇచ్చేలా కృషి చేయాలని సూచించారు. గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బొమ్మరవేని తిరుమల, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజీ హరీష్, కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్ ఒంటెల మురళీకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ వంచ సుదర్శన్ రెడ్డి, కలిగేటి కవిత, తడగొండ అంజలి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉప్పుల అంజనీప్రసాద్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులుగౌడ్ పలువురు పాల్గొన్నారు.

గంగాధర: మొదటి ప్రాధాన్యత ఓటు నరేందర్‌రెడ్డికి వేయాలని ఎమ్మెల్యే సత్యం పిలుపునిచ్చారు. మంగపేట గ్రామపంచాయతీ పరిధిలోని ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు, పట్టభద్రులతో ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. అంతకు ముందు కురిక్యాల నుంచి ఫంక్షన్‌హాల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. నరేందర్‌రెడ్డికి పట్టభద్రుల సమస్యలపై అవగాహన ఉందని, గత పదేళ్లలో పట్టభద్రులు, ఉద్యోగులు, నిరుద్యోగులను బీఆర్ఎస్ మోసం చేసిందని, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజిత–శ్రీనివాస్‌రెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు తిరుమల్‌రావు, నాయకులు నర్సయ్య, రాజగోపాల్‌రెడ్డి, భాస్కర్, మనోహర్, శంకర్, యగ్నేష్, సంధ్యాకరుణాకర్, బుచ్చయ్య, గంగన్న, విద్యాసాగర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్తుకనుకయ్య, పడాల రాజన్న, అట్ల శేఖర్‌రెడ్డి, చక్రపాణి, రోహిత్‌రెడ్డి, మల్లేశం, చందు, మధు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీదే విజయం



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి శాంతకుమార్

గంగాధర: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయం ఖాయమని ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి శాంతకుమార్ అన్నారు. మండలంలోని మధురానగర్‌లో గురువారం చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి వైద రామానుజం ఆధ్వర్యంలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన నాయకులు మాట్లాడుతూ... నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు బీజేపీ బలపరిచిన అంజిరెడ్డి, మల్కా కొంరయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రావణ్, నాయకులు మేకల ప్రభాకర్‌యాదవ్, రవి ప్రభాకర్, బత్తుల లక్ష్మీనారాయణ, కర్నె ప్రభాకర్‌రెడ్డి, బింగివేణు, దూళం కళ్యాణ్, సింగిరెడ్డి కృష్ణారెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడే వ్యక్తి శేఖర్‌రావు

హుజూరాబాద్: కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న యాదగిరి శేఖర్‌రావుకే సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు హుజూరాబాద్ మండల ట్రస్మా అధ్యక్షుడు వకుళాభరణం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలు, ఉపాధ్యాయుల హక్కుల కోసం పాటుపడే వ్యక్తి శేఖర్‌రావు, ప్రభుత్వంతో పోరాడి శక్తి ఆయనకే ఉందన్నారు. సమావేశంలో ట్రస్మా ప్రధాన కార్యదర్శి పారెడ్డి రవీందర్ రెడ్డి, నియోజకవర్గం అధ్యక్షులు బద్దుల రాజకుమార్, కోశాధికారి దాసరి కోటేశ్వర్, జిల్లా నాయకులు మాడిశెట్టి ప్రసాద్, విన్సెంట్ జార్జ్, ఏనుగు మహిపాల్‌రెడ్డి, గోపాల్, వెంగళరావు, తిరుపతి యాదవ్, విజయ్‌పాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు, నాయకులు